ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# గుంటూరు జిల్లా వార్తలు

3

సోమవారం 13 జనవరి 2025



**సంక్రాంతి శోభ**

- గ్రామాల్లో పండుగ సందడి
- బంధువుల రాకతో గ్రామాలు కళకళ
- హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు

4

వీవీఐటీ విద్యార్థుల దర్గా టు దుర్గా

అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం


కత్తికట్టి కాలుదువ్వేందుకు కోళ్ళు సిద్ధమైపోతే కట్టలు తెంచుకుని మరీ పందాలకు కోట్లవిలులైన నోట్లు బయటకు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కేవలం మూడురోజుల్లోనే కోట్లాది రూపాయలు చేతులు మారేందుకు కోడిపందాల బరులు సిద్ధమైపోయాయి. భోగి, సంక్రాంతి, కనుమరోజుల్లో పందాలు వేసుకునేందుకు అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వదిలేస్తుండటంతో దీనిని ఆసరా చేసుకుని కొన్నిచోట్ల ఇప్పటికే జూద క్రీడ కూడా మొదలైపోయింది. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో, ఆదివారం నుంచే బరుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పేకాట,కోతముక్క,గుండాట జోరుగా సాగిపోతున్నాయి. కోడిపందాలైతే సిద్ధంచేసిన బరులతో పనిలేకుండా కృష్ణాతీరంలో సముద్రతీరంలోని కొన్నిచోట్ల పందాలు వేస్తున్నారు. తీర ప్రాంతంలో కోడిపందాల విషయంలో తగ్గేదేలేదంటూ పందెం రాయుళ్ళు కూడా నోట్లకట్లను బద్దలుకొట్టి సంప్రదాయ క్రీడపేరుతో పందాల రూపంలో విరజిమ్ముతూనే ఉన్నారు.

- సంప్రదాయం ముసుగులో కోడి పందాలకు సిద్ధం
- భారీగా బరులు, పేకాట శిబిరాలు
- ఒక్కో ఆటకు ఒక్కో రేటు
- తెలంగాణా నుంచీ పందాలకు బారులు
- పోలీసుల ఆదేశాలు బేఖాతరు



చెరుకుపల్లిమండలం తూర్పుపాలెంలో 30ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరులు

# కాలు దువ్వుతున్న కోళ్ళు



తెనాలి, కొల్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో అధికార పార్టీకిచెందిన కీలకనేతలే ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి కోడిపందాలు, పేకాట, లోనాబయట, కోతముక్క, గుండాట ఆడించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆయా ఆటల నిర్వాహకులకు అప్పగించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా సరే కోడిపందాలు,పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసినా, అందుకు విరుద్ధంగా భారీ బరులను సిద్ధం చేశారు. కొల్లిపర, నాదెండ్ల మండలం సాతులూరు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం మరికొన్నిచోట్ల బరులను పోలీసులు దున్నేశారు. డెల్టాలో మాత్రం బరులు యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. వేమూరు మండలం జంపనిలో అయితే ఏకంగా తెనాలి, రేపల్లె ప్రధానరహదారిపై సొంత బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టివెయ్యటం అధికారుల ఆదేశాల అమలుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పెదకూరపాడు మండలం ముస్సాపురం, అమరావతి మండలం లేమల్లె గ్రామంలో భారీ బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద ఎక్కువ శాతం టీడీపీ,జనసేన జెండాలను,భారీప్లెక్సీలను ఏర్పాటు చేసి మరీ సంక్రాంతి సంబరాలకు రారండి అంటూ బహిరంగంగానే ఆహ్వానం పలకటం విశేషం.



కొల్లూరులోని కోడి పందేల బరి

## ఉమ్మడి గుంటూరు జిల్లాలో...


ఉమ్మడి గుంటూరుజిల్లాలోని రేపల్లెనియోజకవర్గం చెరుకుపల్లిమండలం తూర్పుపాలెం,బాపట్లనియోజకవర్గంలోని పిట్టలవారిపాలెంలో, గుంటూరు, పల్నాడు జిలాల్లో అక్కడక్కడ కోడిపందాలు వేసేందుకు బరులను ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కిందిస్థాయి అధికారులెవరూ పట్టించుకున్న పరిస్థితి తీర ప్రాంతంలో ఎక్కడా కనపడటంలేదు. రేపల్లె నియోజకవర్గం తూర్పుపాలెంలో ఒక వీఐపీ బరి, ఇతరుల కోసం ఏడుబరులు ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట ఆడుకునేందుకు ప్రత్యేక టెంటులను ఏర్పాటు చేశారు.

చెరుకుపల్లినుంచి నగరం వెళ్ళే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారికి నిబంధనలకు విరుద్ధంగా భారీప్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ రహదారిలో వెళ్ళే ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనానికి రూ.100లు పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుండగా కార్లకు రూ.200లు ఫీజు వసూలు చేస్తున్నారు. వీఐపీ బరుల వద్ద వచ్చే వీఐపీలకు (మిగతా 4వ పేజీలో)

"రేపల్లె నియోజకవర్గంలో కోతముక్క, పేకాట, నెంబర్లాట, రింగ్ ఆట నిర్వహణ, హైదరాబాద్, విజయవాడకు చెందిన వారికి రూ.40లక్షల నుంచి రూ.80లక్షలకు కాంట్రాక్టు అప్పగించారని తెలుస్తోంది. పార్కింగ్ ప్రదేశాన్ని రూ.6లక్షల చొప్పున అధికార పార్టీలోని మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు వేలం పెట్టి రూ.5లక్షలకు పైగానే పాట నిర్వహించారు. బిర్యాని పాయింట్ ఏర్పాటునకు లక్ష రూపాయలు, శీతల పానీయాలు, గుట్కా ఖైనీ, సిగరెట్లు అమ్ముకొనేందుకు లక్ష రూపాయలు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కోడి పందెం బరులు కూడా రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు తదితర కేటగిరీలుగా ఏర్పాటు చేసి ఆయా బరుల్లో ఆ కేటగిరీకి సంబంధించిన వారు పందాలు కాసుకునే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు."

## తీరంలో జూలు విదిల్చిన జూదం

కూటమి ప్రభుత్వం పెద్దలకు అత్యంత సన్నిహితుడుగా పేరున్న వ్యక్తి అతను. అయితే రేపల్లె నియోజకవర్గంలో భారీ ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. నగరంమండలం,ఏలేటిపాలెంలోని సపోట తోట మధ్య భారీ షెడ్డు, రేపల్లెమండలం ఉప్పూడి శివారులో భారీషెడ్డును ఏర్పాటుచేసి రాత్రి 7గంటలకు ప్రారంభించి ఉదయం 6గంటల వరకు పేకాట, కోతముక్క నిర్వహిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ఉభయగోదావరి జిల్లాల నుంచి జూదరలు ఇక్కడకు ప్రతి రోజూ వస్తుంటారు. నిత్యం వచ్చే వారికి ఇక్కడ సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇదే నిర్వాహకుడు గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది మధ్యభాగంలోని రేవులో రేపల్లెటౌన్, నగరం, నిజాంపట్నం ప్రాంతంలో అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో భారీ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. ప్రభుత్వం మారినా ఇప్పటి అధికారపార్టీనాయకుల అండదండలతో అతనే పేకాట శిబిరాలు నిర్వహించడం విశేషం. ఇది ఈ మూడు రోజుల తంతు కాదు. ప్రతి రోజూ జరిగే తంతేనని, ఒక్క కోతముక్క ఆటే రూ. 50 లక్షల వరకు ఉంటుంది. బంకినీ రూపంలో అతనికా రోజుకు రూ.2లక్షల వరకు వస్తాయంటే అక్కడ రోజు ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



తూర్పుపాలెంలో పేకాటకోతముక్క ఆడేందుకు ఏర్పాటు చేసిన గుడారం



తూర్పుపాలెంలో కోడిపందాల బరులవద్ద ఏర్పాటుచేసిన కోతముక్క లోనాబయట పేకాటశిబిరాలు

## పల్లెకోనలో సిద్ధం కాని పందెం బరి

"సంక్రాంతి సంబరాలలో భాగంగా భట్టిప్రోలు మండలం పల్లెకోన వద్ద ఏర్పాటు చేసిన బరి ఇంకా సిద్ధం కాలేదు. నియోజకవర్గంలోని మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన బరులలో పందాలు ప్రారంభం కావడంతో ఇక్కడ కూడా బరి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రింబవళ్లు శ్రమించి సోమవారం ఉదయానికి బరి సిద్ధం చేసే పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధి కుమారుని చేత సంక్రాంతి సంబరాలు ప్రారంభం చేయించనున్నట్లు సమాచారం."

## అదనపు ఆకర్షణగా ఎన్‌ఫీల్డ్ వాహనాలు



కోడి పందాలు బరులు వద్ద ఎన్‌ఫీల్డ్ వాహనాలు ప్రధాన ఆకర్షణగా నిర్వాహకులు ప్రదర్శనగా ఉంచారు. కొల్లూరు, జంపని కోడి పందాల బరుల వద్ద నిర్వాహకులు ప్రతిపాదించిన పందాలు నెగ్గిన పందెంరాయుళ్లకు ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాలు బహుమతులుగా ఇవ్వనున్నారు. గత ఏడాది కొల్లూరు మండలం పెసర్లంక వద్ద ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో రెండు ఎన్‌ఫీల్డ్ వాహనాలను నిర్వాహకులు ఒక్కొక్క కోడి పుంజు ఐదు పందాలు గెలిస్తే ఆయా పందెం రాయుళ్లకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేశారు. ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఏర్పాటు చేయడంతో ఆయా బరులకు పెద్ద పెద్ద పందాలు కాసే పందెంరాయుళ్లు అధిక సంఖ్యలో వచ్చేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు ఈ పద్దతి ఎంచుకున్నారు. అసలైన కోడి పందాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మాత్రం నిర్వాహకులు అనధికారిక కోడి పందాలకు తెర లేపారు.



చెరుకుపల్లి : తూర్పుపాలెంలో సిద్ధం చేసిన వీఐపీ కోడిపందాల బరి



కొల్లూరు : పందెం బరిలో ప్రారంభమైన కోడి పందాలు

# భోగభాగ్యాల భోగి

## పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికే భోగి పండగ

**తెలుగునాట మకర సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అంతటి ప్రాముఖ్యత ఉన్న పండుగను తెలుగు ప్రజలు భోగితో మొదలు పెడతారు. తొలిరోజు భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి వేడుకలు నాలుగు రోజులపాటు జరుపుకుంటారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో ఇంటిల్లపాదీ పండుగ వేడుకల్లో మునిగి తేలుతారు. అలా ప్రతి ఇంటికి సంతోషాలను స్వాగతించే తొలి పండుగ దినం భోగి కావడంతో దానికి తెలుగునాట ఎంతో ప్రాధాన్యముంది.**



- నెల రోజులపాటూ మహిళల ధనుర్మాస పూజలు
- భోగి పండ్లు.. భోగి మంటలు.. బొమ్మల కొలువులతో సందడే సందడి
- చలిని తరిమి, వెచ్చదనాన్ని పంచే భోగి మంటలు
- నెల రోజులపాటు ఇళ్ల ముందు రంగవల్లులతో అలంకారాలు
- ఆనందంతో పాటు.. ఆరోగ్యాన్ని ఇచ్చే పండుగ

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగునాట పెద్ద పండుగగా జరుపునే సంక్రాంతిని మొదటిరోజు 'భోగి పండుగగా జరుపుకుంటారు. దక్షిణాయణంలో సూర్యుడు రోజు రోజుకూ భూమికి దూరమవడం వలన చలి విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. ఆ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు. ఉత్తరాయణానికి ముందురోజుకి చలి తారాస్థాయికి చేరుతుంది. దీంతో ఆ చలిని తట్టుకోవడానికి ప్రజలంతా పెద్దగా మంటలు వేసుకుంటారు. కాల క్రమంలో అదే భోగి మంటలుగా ప్రజల సంప్రదాయంలో భాగమైపోయాయి. ఆ భోగి మంటల్లో తాము ఇప్పటి వరకూ పడిన కష్టాలను, బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చి రాబోయే ఉత్తరాయణంలో తమకు సుఖ సంతోషాలను ఇవ్వాలని కోరుతూ భోగి మంట్లో వేడు కుంటారు.

### నెల రోజుల పూజా కార్యక్రమాలు

హిందూ మత విశ్వాసాలు, సంప్రదాయం ప్రకారం, మకర సంక్రాంతికి ముందు రోజున భోగి పండుగ వస్తుంది. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగీ' పండుగను జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి జనవరి 13, సోమవారం నాడు వచ్చింది. ఈ పండుగను రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమి ళనాడుల్లోనూ జరుపుకుంటారు. అయితే తెలుగునాట జరిగే సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. భోగి రోజు నుంచే సంక్రాంతి సంబరాలు మొదల వుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ సందళ్లు తారా స్థాయికి చేరతాయి. దాదాపు నెలరోజులపాటు ధనుర్మాస పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి పండుగతో సంక్రాంతి వేడుకల్లోకి ప్రవేశిస్తారు. ధనుర్మాసంలో మహిళలు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి ధనుర్మాస వ్రతం ఆచరిస్తారు. యశోదా తనయుడుకి బాల భోగం సమర్పించి హారతి ఇస్తారు. ఆడపిల్లలు నెలరోజులూ ఇళ్ల ముంగిట్లో కళ్లాపు జల్లి రకరకాల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టి, బంతి, చామంతి, తంగేడు, గుమ్మడి పూలతో అలంకరిస్తారు. శుభ సూచకంగా పసుపు, కుంకుమతో వాటిని పూజిస్తారు. వాటన్నింటికీ ముగింపుగా సంక్రాంతికి ముందురోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేసుకుని చిన్నా, పెద్ద అందరూ ఆ మంటల చుట్టూ చేరి చలికాచుకుంటారు.

భోగి పండుగ రోజున చాలా కుటుంబాల్లో చిన్నారులపై భోగి పండ్లను పోసి పెద్దలు ఆశీర్వదించడం పరిపాటి. అదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పండ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పండ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు. కాగా భోగి పండ్లలో రేగి పండ్లదే అగ్రతాంబూలం. రేగి చెట్టును సంస్కృతంలో బదరీ వృక్షం అంటారు. బదరీ అనేది ఆ శ్రీమన్నారాయణుడికి మరో నామం. ఆయన పేరుకు ప్రతి రూపంగా భావించి రేగి పండ్లను పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. రేగి పండు సూర్యుడికి ప్రీతిపాత్రమైన ఫలం. సూర్యుడి రంగు, రూపు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణాలను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తలపై పోయడం ద్వారా పిల్లలకు ఆ స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. పిల్లలకు ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని పెద్దల విశ్వాసం. ఈ పవిత్రమైన రోజున ఇంద్ర దేవుడు, వరుణ దేవుడిని పూజిస్తారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు.

# సంక్రాంతి శోభ

● గ్రామాల్లో పండగ సందడి ● బంధువుల రాకతో గ్రామాలు కళకళ ● హరిదాసుల సంకీర్తనలు.. పిండి వంటల ఘుమఘుమలు



క్రోసూరులో గంగిరెద్దుల విన్యాసాలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాలు, పల్లెలకు సంక్రాంతి శోభ చేకూరుతుంది. ఎటు చూసినా మహిళలు రంగురంగుల ముగ్గులతో వీధులను అలంకరించే దృశ్యాలు కన్పిస్తున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు వీధుల్లో దర్శన మిస్తున్నాయి. ప్రాతఃకాలంలోనే హరిలో రంగ హరి అంటూ హరిదాసుల సంకీర్తనలు వీనుల విందుగా పల్లె వాసులను నిద్ర లేపుతున్నాయి. వివిధ దేవాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తి గీతాలాపనలు, తిరుప్పావై పఠనాలు, పూజారుల మంత్ర పుష్ప వినియోగాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మరో పక్క దూర ప్రాంతాల నుంచి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకొనే బంధువులతో పల్లెలు కళకళ లాడుతున్నాయి. ధాన్యపు నూర్పిళ్లు, కల్లాల్లో కొత్త ధాన్యం తూర్పారబట్టే దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఎద్దుల మువ్వన్నెల సవ్వడితో దిగుబడులను ఇంటికి చేరవేసే దృశ్యాలు దర్శన మిస్తున్నాయి. శావల్యాపురం మండలం, పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలోని సభ్యులు దాదాపు 70 మంది శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవనున్నారు. కొల్లిపరకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం కలుసుకొని సామూహిక భోజనం చేశారు. దోస్త్ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు.

## ఏటా కలిసే సంప్రదాయం

సంక్రాంతి పండగ వచ్చిందటే ఆ గ్రామంలోని ఆ కుటుంబంలోని సభ్యులందరూ కలవాల్సిందే. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ చేసిన పిండి వంటలతో, భోగి మంటల మధ్య సంబరాలు జరుపుకుంటారు. వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలంలోని పోట్లూరు గ్రామంలో గడిపూడి పేరయ్య, కోటమ్మ దంపతుల కుటుంబంలో సందడి వాతావరణం నెలకొంది. పేరయ్య దంపతులకు గడిపూడి నరసయ్య, పున్నయ్య కుమారులతోపాటు మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సయ్య, పున్నయ్య వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. నరసయ్య, పాపమ్మ దంపతులకు గడిపూడి వెంటకరాయుడు, నాగేశ్వరరావులతోపాటు ఐదుగురు కుమార్తెలు కలరు. గడిపూడి పున్నయ్య, బాపనమ్మ దంపతులకు హనుమంతరావు, పేరయ్య కుమారులతోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరికి చెందిన 18 కుటుంబాలు ప్రతి ఏడాది సంక్రాంతి పండగను పురస్కరించుకొని వారంత పోట్లూరు గ్రామంలోని పూర్వీకుల నివాస గృహానికి చేరుకొని సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. గడిపూడి వెంకటరాయుడు ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డ్ అవ్వగా నాగేశ్వరరావు ఆర్అండ్‌బీ ఏఈగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. వీరందరూ శావల్యాపురంలోని వెంకటరాయుడు గెస్ట్‌హౌస్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. గత ఐదేళ్లుగా మొత్తం 70 మంది సభ్యులు కలిసి భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. భోగి మంటలతోపాటు చక్కటి రంగవల్లులు, గుమగుమలాడే పిండివంటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఒకే వంశానికి చెందిన 70 మంది కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వారి వారి వృత్తుల్లో స్థిరపడినప్పటికీ సంక్రాంతి పండగకు అందరూ కలిసి కష్టసుఖాలు, యోగాక్షేమాలు తెలుసుకుంటూ శావల్యాపురంలోని గెస్ట్‌హౌస్‌లో కలవడం గమనార్హం.



గత సంక్రాంతికి కలిసిన నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు



## ఎల్లలు దాటిన అనుబంధం

ఆ వంశీయుల అనుబంధం ఎల్లలు దాటింది. ప్రతి సంవత్సరం అందరూ సంక్రాంతి పండగకు కలుసుకునే సంప్రదాయంతో గ్రామీణ వాతావరణానికి శోభ చేకూరింది. కొల్లిపరకు చెందిన ఆరిమండ, బొంతు, భీమవరపు, జొన్నల, జంగా, ఉయ్యూరు వంశీయులు ఆదివారం పరస్పరం కలుసుకున్నారు. దూరప్రాంతాలలో ఎక్కడ ఉన్నా ఏటా కలుసుకునే సంప్రదాయాన్ని ఆ వంశస్తులు పాటిస్తున్నారు. తమ ఆడపడుచులను కూడ పిలిచి పసుపు, కుంకుమలతో పాటు బట్టలు పెట్టి దీవించి పంపడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆ వంశీయులు ఆదివారం ఏర్పాటు చేసిన సామూహిక విందు భోజనానికి 11 వేల మంది హాజరయ్యారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన వారు గ్రామంలోని అందరిని కలిసి పరస్పరం క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సామూహికంగా విందు భోజనం చేశారు.



కొల్లిపరలో సామూహికంగా భోజనం చేస్తున్న ఆరిమండవారి వంశీయులు

## దుగ్గిరాలను అగ్రగామిగా నిలబెట్టవచ్చు

టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేని తండ్రికి పెద్దకొడుకునైన నేను కాఫీ ఫ్యాక్టరీ స్థాపించానని, ప్రపంచ ప్రఖ్యాత కాంటినెంటల్ ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ అన్నారు. దోస్త్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబారాలను ఆదివారం రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, పోటీలను ప్రారంభించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తన తండ్రి జస్టిస్ చల్లా కొండయ్య తన జీవితంలో టీ, కాఫీ తాగే అలవాటు కూడా లేనప్పటికీ, తనకు కాఫీ ఫ్యాక్టరీ స్థాపించే అవకాశం దేవుడు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దుగ్గిరాలను 1995లోనే దత్తత తీసుకున్నందున సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చామన్నారు. విద్యపరంగా ఎంతో అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ దశాబ్దకాలంగా సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్సై ఎస్. వెంకటరవి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సేవాకార్యక్రమాలు చేపడుతూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేయడం, క్రీడపోటీలు, ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, దోస్త్ ప్రతినిధి చాగర్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దోస్త్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్ బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభించారు. సీసీ ఫ్యాక్టరీ పీఆర్‌ఓ బలరామ్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, దోస్త్‌కు చెందిన జంపాల సుబ్బారావు, గద్దె శ్రీనివాస్, తె.దే.పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, సర్పంచ్ కుషీబాయి, ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు, సరళాదేవి పీఈటీలు రవి, జమీర్, జంపాల నీరజాక్షి, బి. సంగమేశ్వరరావు, దోస్త్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



దోస్త్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దుగ్గిరాల సీసీఎల్ (కాఫీ ఫ్యాక్టరీ) చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్

## పండగ పిలుపు కోసం వృద్ధాశ్రమంలో నిరీక్షణ

'మా బాబు వస్తాడు, పండగకు తీసుకు వెళ్తాడు, వాడి పిల్లలను చూడాలని ఉంది, వాళ్లతో కలిసి పండగ చేసుకోవాలని ఉంది' ఓ వృద్ధురాలి ఎదురు చూపు. 'మా మనువళ్లను చూసి చాలా రోజులైంది. నన్ను తీసుకు వెళ్తే వారితో ఆప్యాయంగా మాట్లాడాలనుకుంటున్నాను, వారు ఎలా ఉన్నారో, వెంటనే చూడాలని ఉంది. ఓ వృద్ధుడి ఆత్రం. పండగ అంటేనే అందరూ కలసి జరుపుకొనేది. అందులోనూ సంక్రాంతి మరీ ప్రత్యేకం. పెద్దలు లేనిదే కాంతి లేదు. అయితే సత్తెనపల్లి పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో ఉంటున్న పలువురు పెద్దలు కన్న పేగు పిలుపు కోసం పరితపిస్తున్నారు. తమను సంక్రాంతికి తీసుకు వెళ్తారని ఎదురు చూస్తున్నారు.



సత్తెనపల్లిలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధుల ఎదురు చూపు

# వీవీఐటీ విద్యార్థుల జాతి సమైక్యతా నడక 'దర్గా టు దుర్గా'

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు 14వ జాతిసమైక్యత నడక 'దర్గా టు దుర్గా'ను ఆదివారం నిర్వహించారు. గుంటూరు నగరంలోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా వద్ద గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జెండా ఊపి ఈ సమైక్యతా నడకను ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి జైన్ టెంపుల్, డోలాస నగర్ చర్చి మీదుగా విజయవాడ దుర్గ గుడి వరకు 33 కి.మీ. మేర సాగిన ఈ నడకలో కళాశాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి విభాగాల క్యాడెట్స్ పాల్గొన్నారు. మార్గమధ్యలోని దేవాలయాలు, చర్చిలలో విద్యార్థులు ప్రత్యేక పూజ, ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లడుతూ దేశ సమగ్రత, సమైక్యతను చాటేలా దర్గా టు దుర్గా పేరుతో ఈ నడక నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ గత 14 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ. ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



'దర్గా టు దుర్గా'ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, పక్కన విద్యాసాగర్

# 31న విజ్ఞాన్స్ వర్సిటీలో బాల మహోత్సవం

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31 నుంచి రెండు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిన్నారుల పండగ విజ్ఞాన్ బాల మహోత్సవ్ పోస్టర్లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చిన్నారులకు సంబంధించి భారీ బాల మహోత్సవ్ కార్యక్రమానికి యూనివర్సిటీ వేదిక కాబోతోందన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

## ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ వారి ఉన్నతకి కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ చేస్తున్న కృషి అభినందనీయమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు ఆదివారం స్థానిక కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య అధ్యక్షత వహించారు. జీవీ ఆంజనేయులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఏటా రూ.50 లక్షల వరకు విద్యా ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అన్నారు. 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలు అందించినట్లు వివరించారు. నాట్కో ఫార్మా వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, బొప్పన ద్వారక ప్రసాద్, పుట్టగుంట వేణుగోపాలరావు, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, డాక్టర్ వడ్లమూడి గోవర్ధన్‌రావు, నామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, డాక్టర్ బసవపున్నయ్య

# ప్రభుత్వ గ్రాంట్‌తోనే ఏఎన్‌యూలో సకాలంలో జీతాలు

● వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వ గ్రాంట్ ద్వారానే సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం స్పష్టం చేశారు. ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నవంబర్-2024 జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ 5.5 కోట్లు విడుదల చేసిందనీ, ఆ నిధులను ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించినట్లు తెలిపారు. అలాగే నాలుగో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.17.5 కోట్లను విడుదల చేయగా డిసెంబర్ 2024 జీతాలను సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లిస్తున్నామని వివరించారు. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా పెన్షన్‌లు సకాలంలో చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా యూనివర్సిటీలో 140 మంది వరకు క్యాజువల్ వర్కర్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఎటువంటి అవసరం లేకపోయినా వీరిని నియమించారనీ, వీరికి ప్రతినెలా జీతాలు చెల్లించే క్రమంలో వర్సిటీపై ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు నిలిచిపోలేదని, వారికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో ఆర్థిక వ్యవహారాలు పరిగణనలోకి తీసుకుంటే గత మూడేళ్లలో ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో అనేక అవకతవకలు గుర్తించినట్లు పేర్కొన్నారు.

# కాలు దువ్వుతున్న కోళ్లు

(3వ పేజీ తరువాయి)

మాంసాహారం, డ్రైఫ్రూట్స్, బిర్యానీలతో పాటు వివిధ రకాల జ్యూస్‌లు అందించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. భారీ సోఫాలు, ఎయిర్‌కూలర్స్‌ను, విద్యుద్దీపాలను, బెలూన్స్‌ను ఏర్పాటు చేశారు. కోతముక్క, పేకాట, ఆడే శిబిరాల్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆదివారం తూర్పుపాలెంలో కోడిపందేలను ప్రారంభించారు.

## గత వారంరోజులుగా తీరంలో జోరుగా కోడి పందేలు

తీరప్రాంతంలో ఇంత స్థాయిలో కోడిపందేలు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైన చూసే పరిస్థితి లేదు. ఇష్టానుసారంగా పందెలు వేస్తుంటే పట్టించుకోరా అని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తుంటే, రాజకీయనాయకుల ఒత్తిళ్ళ కారణంగా మేము ఏమీ చెయ్యలేకపోతున్నామంటూ అధికారులు చేతులెత్తివేశారు. దీంతో నగరం,రేపల్లె మండలం గుడికాయలంక, నిజాంపట్నం మండలం పల్లపట్ల, అడవులదీవి, కొత్తపాలెం ప్రాంతాల్లో గత వారంరోజులుగా జోరుగా కోడిపందాలు సాగుతున్నాయి. లక్షలాదిరూపాయలు పందాలు జరుగుతుండగా కొంతమంది పందెంరాయుళ్ళు లక్షల్లో నష్టపోయి వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు.

# అమరావతిలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

● ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ క్రికెట్ టోర్నీ
● నెలాఖరుకు విజయనగరంలో క్రికెట్ అకాడమీ
● రూ.50 కోట్లతో వైజాగ్ స్టేడియం ఆధునికీకరణ
● ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో మంత్రి నారా లోకేశ్ ముందుచూపుతో ఉన్నారని చెప్పారు. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతి ఏటా ఎంపీఎల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో నియోజకవర్గ స్థాయికే పరిమితమైన ఈ టోర్నీని ఏసీఏ సహకారంతో ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కో టీంతోపాటు మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు తలపడుతుందని చెప్పారు. 23వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు అవసరమయ్యే మైదానాలతోపాటు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామని, విజయనగరంలో ఈ నెలాఖరు నాటికి క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అలాగే అనంతపురంలో మహిళా క్రికెట్ అకాడమీని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమరావతిలో ఇప్పటికే ఉన్న నవులూరు స్టేడియంతోపాటు మరో అంతర్జాతీయ మైదానం కూడా ఏర్పాటు కాబోతుందన్నారు. మంగళగిరి స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవలే మద్రాస్ ఐఐటీ వారితో స్టేడియం నిర్మాణాలను పరీక్షించినట్లు తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో త్వరలో ఏపీఎల్ టోర్నీకి సన్నాహాలు చేస్తున్నామని ప్రకటించారు. రాబోయే కాలంలో ఏపీ నుంచి 25 మంది క్రీడాకారులు ఐపీఎల్‌కి ఎంపికయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. విశాఖపట్నం స్టేడియాన్ని రూ.50 కోట్లతో ఆధునికీకరించనున్నట్టు వెల్లడించారు. ఈ పనులు మార్చి నాటికి పూర్తిచేసి ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం వద్ద ఫోర్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి రానున్న బడ్జెట్‌లో అనుమతి రానుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో తన సొంత నిధులతో 147 పాఠశాలల మైదానాలను ఆధునికీకరించి లాంగ్ జంప్ పిట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23న మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా 8 రకాల క్రీడా వస్తువులతో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్

## క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

ఈపూరు, జనవరి12 (ఆంధ్రజ్యోతి): క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా గ్రామంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. గ్రామస్తులు కలిసికట్టుగా సంప్రదాయ ఆటలు పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, విడపలపాటి హనుమయ్య, కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 564.70 అడుగులు ఉంది. 243.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8853, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, ఔట్‌ఫ్లో వాటర్‌గా 26,863 విడుదల చేస్తున్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 113,121,132 |
| చికెన్ విత్ స్కిన్ | 216.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 226.00 |

## నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను దృష్టిలో ఉంచుకుని నేడు సోమవారం పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడవద్దని ఆయన సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: డేగల ప్రభాకర్



గుంటూరు, జనవరి 12(ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనం దోత్సాహాలతో జరుపు కోవాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ప్రజలకు సంక్రాంతి పండగ శుభా కాంక్షలు తెలిపారు. భోగభాగ్యాల భోగి, సంబ రాలు పంచే సంక్రాంతి, రైతులకు ఇష్ట మైన కనుమను ప్రజలు సంస్కృతీసంప్ర దాయాల నడుమ వైభవంగా జరుపు కోవాలని అన్నారు. ప్రజలు సుఖ, శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సకల జనహితానికి, ప్రగతి పథానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతోనే తిరుపతి ఘటన

● ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి



గుంటూరు(తూర్పు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతోనే తిరుపతిలో తొక్కిసలాట జరిగిందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. స్థానిక రామనామక్షేత్రంలో ఈకే ఆధ్యాత్మిక సేవ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రవచనాలకు ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ తిరుపతి ఘటన తనను కలచివేసిందని, భక్తులకు సరైన ఏర్పాట్లు చేయకుండా అధికారులు, టీటీడీ బోర్డు సభ్యులు వీఐపీల సేవల్లో తరిస్తున్నారని ఆరోపించారు. వంద మంది వీఐపీల కోసం లక్షలాది ప్రాణాలను పణంగా పెట్టారని విమర్శించారు. ఐదు లక్షల మందితో హైందవ శంఖరావం నిర్వహించామని, చిన్నపాటి అపశృతి లేదని అన్నారు. సామాన్యులు ఇచ్చే కానుకలతోనే జీతాలు ఇస్తున్నారని ఈ విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే బోర్డును రద్దు చేసి ఆలయ నిర్వహణ సామాన్య భక్తులకు అప్పజెప్పాలని ప్రభుత్వాన్ని కోరతామని అన్నారు. సేవా భావంతో పనిచేయాలని టీటీడీ సిబ్బందికి సూచించారు.

## పతంగులు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

● గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పతంగులు (గాలి పటాలు)ఎగురవేసే సమయాల్లో విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని గుంటూరు టౌన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) తిరుమలశెట్టి శ్రీనివాస బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌లకు దూరంగా, ఖాళీ ప్రదేశాల్లో పతంగులు ఎగురవేసుకోవాలని కోరారు. పతంగులు ఎగురవేసే సమయాల్లో పిల్లల తల్లిదండ్రులు దగ్గరుండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఎన్జీవో కాలనీ పార్కులో సంక్రాంతి సంబరాలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

గుంటూరు (విద్య) జనవరి 12 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎన్జీవో కాలనీ పార్కులో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాలనీలో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులకు పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు,తంబోల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్కు అధ్యక్షుడు జీ సుబ్బాయమ్మ, వీరారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముగ్గురు మైనర్లు సహా ఐదుగురు అరెస్టు

● 3 ద్విచక్ర వాహనాలు, ఐదు కిలోల గంజాయి స్వాధీనం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడి వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ముతో గంజాయి తెచ్చి విక్రయిస్తోన్న ముగ్గురు మైనర్లు సహా ఐదుగురిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు, అరండల్‌పేట స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్ కి చెందిన మందా సుధీర్, మరో ముగ్గురు మైనర్ బాలురతో కలిసి చెడు అలవాట్లకి బానిసై మోటార్ సైకిళ్ళు దొంగతనం చేస్తున్నారు. వాటిని అమ్మి వచ్చిన సొమ్ముతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన అందేగుల రవి కుమార్ అనే వ్యక్తి ద్వారా మరికొందరితో కలిసి విశాఖపట్నం నుంచి గంజాయి తెచ్చి గుంటూరు లో అమ్ముతున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో మందా సుధీర్, అందేగుల రవి కుమార్ మరో ముగ్గురు మైనర్ బాలురు ని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి కేజీ 4.920 గ్రాముల గంజాయితో పాటు మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపారు. ఇద్దరు మైనర్ బాలురను అబ్జర్వేషన్ హోమ్ కి పంపామని, కేసు విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

# రంగవల్లుల హరివిల్లు



ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి, అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నిర్వహించిన రంగవల్లుల, మెహందీ పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. రంగవల్లుల పోటీలో 72 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు వేసిన ముగ్గులు నేలకు హరివిల్లును అద్దాయా అనేంత అందంగా ఉన్నాయి. ఈ సందర్భంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందిస్తామన్నారు. సంక్రాంతి సంబరాలకు హాజరయ్యే ప్రజలు తెలుగు సంప్రదాయాన్ని చాటే వస్త్రధారణతో రావాలని కోరారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ జీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు గుంటూరు నగరానికి సంప్రదాయక సొబగులు తెచ్చాయన్నారు. ఇదే ఉత్సాహంతో మరో మూడు రోజులపాటు జరిగే సంబరాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో జి.సురేఖ, పి.సుజాత, టి.భారతిలకు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. పోటీల్లో పాల్గొన్న 6వ తరగతి విద్యార్థిని సుప్రతికి ప్రత్యేక బహుమతి, మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులను కమిషనర్, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నిర్వహణ కమిటి సభ్యులు డి.శ్రీనివాసరావు, విజయలక్ష్మీ, కాశయ్య, నసీర్ అహ్మద్, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

### సంక్రాంతి సంబరాల్లో రెండోరోజు పోటీలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండో రోజు సోమవారం నాడు జరగనున్న పోటీల గురించి జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటన చేశారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు వీఐపీలకు పూర్ణకుంభ స్వాగతం పలకున్నారు. సన్నాయి మేళం, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, ఫుడ్ స్టాల్స్ ప్రారంభిస్తారు. చిన్నారులకు భోగి పండ్లు, తాడులాగడం, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకు డప్పు వాయిద్యం, తంబోలా, సాంప్రదాయ వస్త్ర పోటీలు (మహిళలు, చిన్న పిల్లలకు), చెక్క భజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలు నిర్వహించన్నుట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఇజ్‌తిమాలో భక్తులకు మంచినీటి బాటిళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

## సర్వమానవ సేవే భగవంతుడి సేవ: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సర్వమానవ సేవ దేవుడి సేవతో సమానమని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నంబూరులో జరుగు తున్న ఇజ్‌తిమా కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఇజ్‌తిమా కార్య క్రమానికి హాజరైన రెండు లక్షల మంది భక్తులకు ఆయన ఉచితంగా మంచి నీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇజ్‌తిమా వంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక చింతనతోపాటు మానసిక వికాసం కలుగు తుందని తెలిపారు. ఇజ్‌తిమాకు నిధులు కేటాయించి, సహాయసహకారాలు అందించిన ముఖ్య మంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని నెలల్లోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని, ముస్లిం కార్పొరేషన్ ద్వారా సులభంగా రుణాలు మంజూరు చేస్తోందని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనాలు అందిస్తున్నామని వెల్లడించారు.



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కళాపరిషత్ సభ్యులు

## సాంస్కృతిక స్థాయిని పెంచుకోవాలి

● కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

● ముగిసిన గుంటూరు కళాపరిషత్ నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జనవరి 12(ఆంధ్ర జ్యోతి): సాంస్కృతిక స్థాయిని పెంచుకున్నప్పుడే నాటక రంగం మరింతగా ముందుకు సాగుతుందని అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటక ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున జరిగే కార్యక్రమాలను, సభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాటక రంగానికి ప్రభుత్వం చేయూత నివ్వాలని కోరారు. ప్రముఖ రచయిత రెంటాల జయదేవ్ మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా నూతన సాంస్కృతిక విధానాలు తీసుకురావాలని కోరారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి బీ పూర్ణ మాట్లాడుతూ పరిషత్ సభ్యత్వ నమోదుకు ఆదరణ వస్తోందని అన్నారు. సభకు పరిషత్ గౌరవ సలహాదారుడు ఆలోకం పెద్ద బ్బయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఎస్ ఎం బాషా దర్శకత్వం వహించిన మట్టి మనిషి నాటకాన్ని ప్రదర్శించారు. అంతకుమందు ప్రముఖ సీనియర్ నటుడు సీ నాగభూషణం నట ప్రస్థానంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గుం టూరు కళా పరిషత్ గౌరవ సలహాదారుడు ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్త వరపు సురేష్ హాజరయ్యారు. అనంతరం నాగభూషణం-ప్రజా నాట్యమండలి, సినిమా రంగంపై ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, నాటక రచయిత కందిమళ్ల సాంబశివరావు ప్రసంగించారు. అనంతరం 'రక్త కన్నీరు నాగభూషణం ప్రజా కళా ప్రస్థానం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో నాగభూషణం కుమారుడు చుండి రాఘవరావు, కళా పరిషత్ సభ్యులు పీవీ మల్లికార్జునరావు, నాయుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద యువతకు ఆదర్శం: ఎమ్మెల్యే మాధవి



వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక 35వ డివిజన్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవా మాట్లాడుతూ స్థానిక పట్టాభిపురంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం ఆసియా ఖండంలోనే అతిపెద్ద 2వ కాంస్య విగ్రహమని చెప్పారు. పట్టాభిపురంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి తన లాంటి వారిలో ఎంతోమందికి స్ఫూర్తిని నింపే విధంగా చేసిన నిర్వాహకులను అభినంది స్తున్నట్లు చెప్పారు. నేటి యువత స్వామి వివేకానంద జీవిత చరిత్ర తెలుసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్ పాల్గొన్నారు.

### మహోన్నతమూర్తి వివేకానందుడు

మానవ సేవే మాదవ సేవ అని చాటిచెప్పిన మహోన్నతమూర్తి, యువతరాన్ని ప్రేరేపించిన మహాశక్తి స్వామి వివేకానంద అని విద్యావేత్త ఈ చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ, వైవీ రెడ్డి, శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

### వివేకానందుడి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

గుంటూరు(తూర్పు), జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు అన్నారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నేరళ్ళ మాధవ్ చరక కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులును శాలువాతో సత్కరించి అభినందిస్తున్న యేల్చూరి, టీఎల్‌వీ తదితరులు

## జడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఆంజనేయులు

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. రైళ్ళలో ప్రయాణించే వికలాంగులు, అనారోగ్యంతో బాధపడే వృద్ధులకు ప్రత్యేకంగా బెర్తులు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే రిజర్వేషన్‌కాల పరిమితి తగ్గించడం, స్టాపింగ్‌లు, రైల్వే సమస్యలపై ఉన్నతాధికారులతో జరిగే సమావేశంలో చర్చిస్తానన్నారు. ప్రజలు కూడా రైల్వేకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ శ్లాబ్‌లను కూడా తగ్గించాలని కోరారు. చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను చాంబర్ దృష్టికి తీసుకొస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆతుకూరి ఆంజనేయులును శాలువాతో సత్కరించి అభినందించారు.





పూల మార్కెట్‌లో బంతిపూలు కొనుగోలు చిత్రం, మార్కెట్లో వివిధ వస్తువుల కొనుగోలు నిమిత్తం వచ్చిన ప్రజలు

## సంక్రాంతి సందడి.. కొనుగోళ్ల కోలాహలం

● పూలు, పండ్ల ధరలకు రెక్కలు

గుంటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో సంక్రాంతి సందడి నెలకొంది. పూజా సామాగ్రి, పూలు, పండ్ల కొనుగోళ్ల ఒకవైపు, కొనుగోలుదారులతో వస్త్ర దుకాణాల్లో మరోవైపు సందడి సందడిగా కనిపించాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగను నేపథ్యంలో నగరంలో ఆదివారం కోలాహల వాతావరణం కనిపించింది. స్థానిక లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, అరండల్‌పేట, బ్రాడీపేట, లాలాపేట, కొత్తపేట ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. చిన్నారులు నుంచి యువతులు, వృద్ధుల వరకు వస్త్రాలకు సంబందించిన ప్రత్యేక ఆఫర్లతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇక స్వీట్ దుకాణాల్లోనూ సందడి కనిపించింది. రంగురంగుల విద్యు ద్దీపాలతో పాటు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. భోగి, సంక్రాంతి పండుగకు ఇంటి ముంగిట వేసుకునే రంగురంగుల ముగ్గుల కొనుగోళ్ళకు మహిళలు ప్రత్యేక ఆసక్తి చూపారు. అరటి, ఆపిల్‌తో పాటు పలు రకాల పండ్లు కొనుగోలు చేశారు. బంతి, గులాబీ, మల్లెపూల ధరలకు రెక్కలొచ్చాయి. బంతిపూలు మూర రూ.10 వరకు విక్ర యించారు. బస్టాండ్ వద్ద నున్న రైతు బజారులో పూలమార్కెట్‌లో కొనుగోలుదారులతో నిండిపోయింది.

## పిండివంటల ఘుమఘుమలు

● నగరంలోని స్వీట్ షాపుల్లో సిద్ధంగా మిఠాయిలు



సంక్రాంతి అంటేనే అరిశెలు ప్రత్యేకంగా గుర్తుకొస్తాయి. తెలుగు వారి సంప్రదాయక పిండివంటలు అరిశెలు, చెక్కరాలు, బూరెలు, పాలతాలికలు ఇలా అనేక పిండి వంటలతో ఇళ్లు ఘుమ ఘుమలాడుతుంటాయి. పండుగకు ఇంటిల్లి పాది ఇష్టంగా తినే రుచులను కుటుంబ సభ్యులు, బంధువులంతా ఒకచోటికి చేరి బియ్యాన్ని దంచి పిండి వంటకాలు చేసేందుకు ఆసక్తి చూపేవారు. అయితే, ప్రస్తుతం అటువంటి పరిస్థితి పెద్దగా కనిపించడం లేదు. పిల్లల చదువులు, ఉద్యోగాలతో దూర ప్రాంతాలు, విదేశాల్లో ఉండటంతో కుటుంబ సభ్యులంతా పిండి వంటలు చేసుకునే పరిస్థితి పెద్దగా కనిపించకుండా పోతోంది. ఎక్కడో అరుదుగా అందరూ కలిసి పిండి వంటలు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో స్వీట్ షాపుల్లో పిండివంటకాలకు డిమాండ్ పెరిగింది. స్వీట్ షాపుల్లో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నగరంలో స్వీట్ షాపులు కూడా వినియోగదారుల అభిరుచులకు అను గుణంగా సంప్రదాయక పిండి వంటకాలు అందజేస్తున్నారు. పిండి వంటకాలను ఆర్డ ర్లపై కొనుగోలు చేస్తున్నారు. సాధారణ అరిశె లతో పాటు నేతి అరిశెలతో రుచులను అంది స్తున్నారు. నాణ్యత మేరకు స్వీట్ షాపుల్లో వాటి ధరలను నిర్ణయిస్తున్నారు. నేతి అరిశెలు కిలో రూ. 600, సాధారణ అరిశెలు రూ 400, బూరెలు రూ 400, సజ్జ బూరెలు రూ 360లు, బొబ్బట్లు రూ 440, చక్కరాలు రూ 340, చక్కలు రూ 360లు ఇలా ధరలతో విక్రయిస్తున్నారు.

## కోడి పందేలు చట్ట రీత్యా నేరం: ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, గుండాట, మట్కా ఆడటం, ఆడించడటం చట్టరీత్యా నేరం, వారిపై చటపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. సంక్రాంతి సెలవులకు ఊర్లకు, విహార యాత్రలకు వెళ్లేవారు తమ ఆస్తులను, ఇళ్లను భద్రంగా కాపాడుకోవడానికి పోలీస్ శాఖ అందించే ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని (ఉచితంగా) ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పోలీస్ వారు తీసుకునే నిర్ణయాలకు ప్రజలు తమ సహకారాన్ని అందించాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలకు పలు హెచ్చరికలు, సూచనలు చేసారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందేలు, జూదం, మట్కా వంటి ఆటలు ఆడటం వలన సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో కొంతమంది ప్రజలు పందేలు కాసి తమ కష్టార్జితాన్ని నష్టపోతున్నారన్నారు. జిల్లాలో కోడిపందేలు, జూదం నిర్వహించకుండా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల సహాయంతో గతంలో కోడిపందేలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓకి (లేదా) డయల్ 112కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న తులసి రామచంద్ర ప్రభు, ఎస్పీ సతీష్‌కుమార్

## తులసి సీడ్స్ ప్రతిభా పురస్కారాలు అందజేత

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : చదువులో ప్రతిభ కనబరిచిన జిల్లాలో పనిచేసే పోలీస్ సిబ్బంది పిల్లలకు తులసి సీడ్స్ సంస్థల తరఫున ప్రతిభా పురస్కారాలను(నగదు బహుమతులు) అందజేశారు. స్థానిక పోలీస్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తులసి సీడ్స్ సంస్థ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, ఎస్పీ సతీష్ కుమార్, తులసి సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర తులసి, అదనపు ఎస్పీ హనుమంతు ఈ పురస్కారాలను అందజేశారు. పోస్టింగ్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, ఇంటర్మీడియట్ మొదలగు తరగతులలో చదువులలో ప్రతిభ కనబరిచిన 114 మంది పోలీస్ సిబ్బంది పిల్లలకు సుమారు రూ.5 లక్షల 87 వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల పిల్లలకు ప్రోత్సాహం ఇస్తూ వారికి ప్రతిభ పురస్కారాలను అందిస్తున్న తులసి సీడ్స్ సంస్థల అధినేత రామచంద్ర ప్రభుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామచంద్ర ప్రభు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు రక్షణ కోసం నిరంతరం పాటుపడే పోలీస్ సిబ్బంది పిల్లలకు తమ సంస్థల తరఫున పురస్కారాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రులు పడుతున్న సాధక బాధకాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నత చదువుల్లో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. యోగీష్ చంద్ర తులసి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే ప్రస్తుతకాలంలో మనం నిలదొక్కుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.హనుమంతు, దళవాయి సుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియే షన్ ప్రతినిధులు మైలా సాంబశివరావు(ఉపాధ్యక్షులు), లక్ష్మయ్య (సెక్రటరీ), బేబిరాణి (ఆర్గనైజింగ్ సెక్ర టరీ), ట్రెజరర్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ షేక్ కరిముల్లా, మోషే పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న జీవీ ఆంజనేయులు తదితరులు

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

గుంటూరు విద్య, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నూతన డైరీని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం ఒక్కటి మాత్రమేనని, 2022లో కొన్ని కారణాల వలన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘాన్ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌గా మార్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గతంలో టీఎన్‌యూఎస్‌కు సంబంధంలేని కొంతమంది ఉపాధ్యాయులు నేడు పార్టీ అధికారంలోకి రాగానే టీఎన్‌యూఎస్‌లో ఉన్నామని చెప్పడం సబబుకాదని అన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌లో దీని బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎన్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో వివిధ వర్గాలకు మేలు చేసేలా ఆర్థిక నిర్ణయం తీసుకున్నం దుకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు , గుత్తే దారులు, పోలీసు సిబ్బందికి అన్ని రకాల బకాయిలు చెల్లించుటకు రూ.6,700 కోట్ల నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అద నపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షడు కోనూరు సాంబశివరావు, గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు పీ సాయి విశ్వనాథ్, ఎన్ టీఏ నాయకులు షేక్ సుభాని పాల్గొన్నారు.




అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

## జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జ్యాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పూర్తిగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ఏడాది జనవరి 1న జ్యాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2లక్షల 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అంతేగాక నోటిఫికేషన్ వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా నిరుద్యోగ భృతిపై సమీక్ష నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్యాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై కార్యచరణ ప్రకటించాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసనల్లో చిన్నపోతుల శ్రీనివాస్, ఏబి వెంకటేశ్వర్ రెడ్డి, సాయి, ప్రణీత్, రెహమాన్, మస్తాన్, ఏసుబాబు, ఖాసీం, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.




## మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

## కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

### డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షుపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షు లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్స్ట్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాథరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

## కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

# చిత్రజ్యోతి

SINCE 1965

## ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

## దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.



## పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.2 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 80 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 136 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 194 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 100 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 760 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధే ధ్యేయంగా పాలన



మోతడకలో బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

• ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంగా అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తున్నామని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మోతడకలో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షల మండలపరిషత్ జనరల్ ఫండ్స్‌తో బస్ షెల్టర్‌ను నిర్మించినట్లు తెపాఆరు. రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.40 లక్షలు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సచివాలయ నిర్మాణం, రూ.17.50 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో హస్పిటల్, రూ.6 లక్షలు గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్స్‌లో వ్యవసాయం గోడౌన్ మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరి ష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుప డుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది ఆమడ దూ రంలో ఉందన్నారు. రాష్ట్రాన్ని దోచుకోవటం తప్ప చేసిందేమి లేదన్నారు. రా ష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి లాగారన్నారు. ప్రజలు గమనించి చిత్తుగా ఓడించారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, నీటిసంఘం అధ్యక్షుడు గుంటుపల్లి మధుసూదనరావు, ఎంపీటీసీ కంచర్ల శివరామయ్య, సీనియర్ నాయకులు యడ్లపల్లి సాంబశివరావు, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ నాసరయ్య, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సభ్యత్వంతోనే భద్రత, భరోసా

• రావి శివరామకృష్ణయ్య

పెదనందిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతోనే కార్యకర్తకు భద్రత, భరోసా కలుగుతుందని పార్టీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య అన్నారు స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో టీడీపీ సభ్యత్వ నమోదు గ్రామ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా కార్యకర్తలకు భరోసా ఇచ్చే పార్టీ టీడీపీయేనని అన్నారు. బీమా సౌకర్యం కూడా కార్యకర్తల కుటుంబాలకు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఆర్ఐ లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్ సాకారంతో 800 మందికి సభ్యత్వ నమోదు ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐ టీడీపీ కార్యదర్శి దివి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శాంతి సువార్త పండుగలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జీసస్ గాస్పెల్ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జీసస్ గాస్పెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు మంగళగిరి - తెనాలి ఫ్లైఓవర్ డౌన్‌లోని మైదానంలో శాంతి సువార్త పండుగలు జరుగుతాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ ఆర్ మోషేబాబు తెలిపారు. ఈ మహాసభలకు సంబంధించిన గోడప్రతులను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోషేబాబు మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాల నుంచి అసోసియేషన్ ఆధ్వర్యంలో దైవ సువార్త కూటములు, పరిచర్య నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరి జేజీఏ డైరెక్టర్ ఎన్ వసంతరావు మాట్లాడుతూ ఐదు రోజులపాటు జరిగే ఈ సువార్త సభలకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శాంతి సువార్త పండుగల కన్వీనర్ పాస్టర్ రావూరి దేవపాల్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సంక్రాంతి సందడి



భోగి మంటలకు సిద్ధం చేస్తున్న డీపీఎఫ్ సభ్యులు

పెదనందిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలు, ఆయా పట్టణాల్లో ఉద్యోగులు చేస్తున్న వారు సైతం స్వగ్రామాలకు చేరుకున్నారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని ప్రధాన కూడళ్లలో మంటలు వేసేందుకు కమిటీసభ్యులు సిద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

## ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని సీతా నగరం ప్రకాశం బ్యారేజీ 13వ ఖానా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం బయటకు తీశారు. బ్యారేజీ పైనుంచి దూకి సదరు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చు అని భావిస్తున్నారు. మృతుడికి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని, ఒంటిపై ఫుల్ కట్ డ్రాయర్, గళ్ల టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో 13 మంది జూదరులు

• రూ.14,800 స్వాధీనం

వట్టిచెరుకూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు ఎస్సీ కాలనీలో, ముట్లూరులో పేకాట నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు వారి సిబ్బంది దాడిచేశారు. పేకాట స్థావరాల వద్ద ఉన్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.14,800 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రమానాయక్ వెల్లడించారు.

## చిలకా వెంకటేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

మంగళగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పుర ప్రముఖులు, బౌద్ధాభిమాని చిలకా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ పాత మంగళగిరి ఎన్‌సీసీ రోడ్డులో ఆదివారం జరిగింది. బుద్ధ విహార, సాహితీ కళావేదిక ప్రతినిధులు వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. మంగళగిరిలో బుద్ధ విహార బలోపేతానికి ఆయన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చిన్నలింగాయపాలెంలో మినీ గోకులం షెడ్‌లను ప్రారంభిస్తున్న టీడీపీ. జనసేన నాయకులు

కాకుమాను, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. మండలపరిధిలోని చిన్నలింగాయపాలెం, కొండబాలవారిపాలెం గ్రామాల్లో ఆదివారం గోకులం షెడ్‌లను జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, సర్పంచ్ యోహానులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఏ రాష్ట్రంలో లేని సామాజిక పింఛన్లు ఇచ్చి వారి ఇళ్లల్లో ఆనందాలు పంచుతుందన్నారు. అలాగే రహదారులు కూడా మరమ్మతులు నిర్వహిస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఏపీవో సింగారావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మండలంలో 27 షెడ్‌లు మంజూరయ్యాయని వివరించారు. రైతు వాటాగా రూ.23 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నక్కల అగస్టీన్, స్థానిక నాయకులు పెద్ది రవీంద్రబాబు, మాకినేని బాపూజీ, కాకుమాను హరీష్, నీటిసంఘాల ప్రెసిడెంట్ ముక్కాల లీలా శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## భగవంతుడిని చేరుకునేందుకు మతం మారాల్సిన అవసరం లేదు

• వివేకానంద అసోసియేషన్ సభ్యుడు కొల్లిపర సుబ్బారావు



ఈమనిలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

దుగ్గిరాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నా మతమే గొప్ప అని భావించే వారు బావిలో కప్ప వంటివారని, భగవంతుడిని చేరుకునేందుకు ఏ మతమూ మారాల్సిన అవసరం లేదని వివేకానంద అసోసియేషన్ సభ్యుడు కొల్లిపర సుబ్బారావు అన్నారు. స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామస్వామి ఆలయ సమీపంలోని స్వామి వివేకానందుడి విగ్రహానికి పలువురు కూటమి నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కాసరనేని కృష్ణ, కొల్లిపర అబ్బారావు, ఎంఈవో కాజ లక్ష్మీనారాయణ, సూరగాని ప్రకాశరావు, రాచకొండ హేమకిరణ్, ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### యువతకు స్ఫూర్తి స్వామి వివేకానందుడు

తాడికొండ జనవరి 12(ఆంధ్రజ్యోతి): నేటి యువత వివేకా నందుడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని రైతుసంఘం నాయకులు చింతల భాస్కరరావు తెలిపారు. ఆదివారం వివేకానందుని జయంతి సందర్భంగా తాడికొండలోని బాలల గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ వివేకనందుని ఆదర్శాలను, సూక్తులను యువత పాటించాలన్నారు. స్వామి వివేకనందుని స్ఫూర్తితో పయనించే యువత భారత మాతకు గర్వకారణయ్యే బిడ్డలని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో బాలబాలికలు, గ్రంథాలయ సిబ్బంది ఏ నాగమల్లేశ్వరి, శేషగిరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగను దృష్టిలో ఉంచుకుని నేడు సోమవారం పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చి ఇబ్బందులు పడవద్దని ఆయన సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## నేడు గ్రామీణ ఆటల పోటీలు

పెదనందిపాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయం వద్ద వెంకయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు గ్రామీణ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## భూములు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు

• సీఆర్‌డీఏ తహసీల్దార్ రవిబాబు

తుళ్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ భూముల ఆక్రమణకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు తప్పవని అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు యూనిట్ సీఆర్‌డీఏ తహసీల్దార్ రవిబాబు పేర్కొన్నారు. అనంతవరం ఊర చెరువును కొంత మంది ఎక్స్‌కవేటర్‌తో పూడ్చటాన్ని పంచాయతీ అధికారులు సీఆర్‌డీఏ అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనంతవరం సీఆర్‌డీఏ భూముల్లో గ్రావెల్ కూడా అపహరణకు గురౌతుందని సమాచారం సీఆర్‌డీఏ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎవరైన మైనింగ్ చేస్తే సంబంధించిన యంత్రాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

## కోడిపందేలు, బెట్టింగ్ వేస్తే కఠిన చర్యలు : తహసీల్దారు

దుగ్గిరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు వేసినా, లేక పందేలపై బెట్టింగ్ వేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఐ సునీత తెలిపారు. గ్రామాల్లో కోడిపందేలపై సమాచారం ఉంటే దుగ్గిరాల ఎస్ఐ ఎస్ వెంకటరవికి సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ కుటుంబసభ్యులతో ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. కోడిపందేలు వేస్తున్న గ్రామం, ప్రదేశం సమాచారం ఉంటే వివరాలను 94409 00861, 703292351, 9963077005కు తెలియజేయాలని కోరారు.

## ప్రాచీన క్రీడలు మరవద్దు

• కేంద్ర నిర్వాహకులు రమేష్‌బాబు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్‌బాబు

పెదనందిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రాచీన గ్రామీణ క్రీడలు నేటి యువత మరవద్దని కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని పాలపర్రు ఐంద్వా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడల పోటీల్లో గెలుపొందిన విజేతకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలు సంఘ నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, సుధాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక స్థాయిని పెంచుకోవాలి

• కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), జనవరి 12(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక స్థాయిని పెంచుకున్నప్పుడే నాటక రంగం మరింతగా ముందుకు సాగుతుందని అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటక ప్రదర్శనలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాటక రంగానికి ప్రభుత్వం చేయూత నివ్వాలని అన్నారు. కళా పరిషత్ నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలకు ప్రజలు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ రచయిత రెంటాల జయదేవ్ మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా నూతన సాంస్కృతిక విధానాలు తీసుకురావాలని అన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి బి పూర్ణ మాట్లాడుతూ పరిషత్ సభ్యత్వ నమోదుకు ఆదరణ వస్తుందని అన్నారు. అనంతరం ఎస్ఎం బాషా దర్శకత్వం వహించిన మట్టిమనిషి నాటకాన్ని ప్రదర్శించారు. భూమిని అమ్ముకుంటే జరిగే అనర్థాలను మట్టిమనిషిలో వివరించారు. 14 భాషల్లో అనువదించిన మట్టి మనిషి నాటకాన్ని వీక్షించడానికి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కళాపరిషత్ సభ్యులు

## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న భూలక్ష్మి తదితరులు

మంగళగిరి సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని 28వ వార్డు బాపనయ్య నగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొమ్మారెడ్డి సుబ్రహ్మణ్యం (నాని), వల్లభనేని వాణి, డాక్టర్ గిరిజ, దుర్గా మల్లేశ్వరి, దిడ్లా సత్యానందం, వీరశేఖర్ బాబు, తోట కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవం

• శ్రీలంక నుంచి రానున్న బౌద్ధ భిక్షువులు

కొల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం వద్దకు సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం నిమిత్తం శ్రీలంక నుంచి 50 మంది బౌద్ధ భిక్షువులు ఇక్కడికి రానున్నారు. ఉదయం 9 గంటలకు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 40 బౌద్ధ స్థూపాల వద్ద 40 నెలల్లో ప్రతినెలా దీపోత్సవం నిర్వహించనున్నారు. బౌద్ధ భిక్షువు బోధిహిన్, యాభైమంది ఉపాసకులతో హాజరుకానున్నారు.



అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న షేక్ చిన జాన్ సైదాకు రూ.2లక్షల64వేల334ల సీఎం సహాయనిధి నగదు చెక్కును ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్ అందించారు. సైదా ఇబ్బందులను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నందుకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, నిజాముద్దీన్, జలాలుద్దీన్, ఇందుపల్లి బాల, ఈవో శరత్, సలాలుద్దీన్, శేషగిరిరావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు. **(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)**

## బాబు కృషితోనే గ్రీన్‌కో ప్రాజెక్టు : మంత్రి టీజీ భరత్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో నిర్మించిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే తలమానికం అని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ముందుచూపుతో ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రంలో నెలకొల్పేందుకు గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2018లోనే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందన్నారు. అయితే ఇప్పుడు కొందరు వ్యక్తులు ప్రాజెక్టు జగన్ విజన్ అని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో అనేక ఇబ్బందులు సృష్టించిందని, అనుమతుల జారీపై జగన్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని తెలిపారు. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచన కూడా వైసీపీకి లేదన్నారు. దీనిపై ప్రజలకు వాస్త వాలు తెలియాలని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మోడల్ స్కూళ్లలో కారుణ్య నియామకాలు చేపట్టాలి

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో పనిచేస్తూ చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ సంఘం అధ్యక్షుడు కె.శివశంకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. పదేళ్లలో 25 మంది టీచర్లు చనిపోయారని, 010 పద్దు కింద జీతాలు ఇస్తున్నా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని తెలిపారు. సర్వీసు రూల్స్‌తో సంబంధ లేకుండా ప్రభుత్వ, జడ్పీ టీచర్ల తరహాలో కారుణ్య నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

## టెన్నిస్ బాల్ క్రికెట్ విజేత నరసింహ సీసీ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో ఆరు రోజులుగా జరుగుతున్న టెన్నిబాల్ క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు జరిగిన సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఫైనల్స్‌లో నరసింహా సీసీ-ఫ్యాక్టరీ సీసీ జట్లు తలపడగా, నరసింహా సీసీ జట్టు విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నరసింహా జట్టు 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. అనంతరం 99 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఫ్యాక్టరీ సీసీ జట్టు 7 వికెట్లు కోల్పోయి 66 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, టోర్నీ నిర్వాహకులు జొన్న రాజేష్, గాదె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మంగళగిరి సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1983-84 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పెదవడ్లపూడిలోని తోటల్లో ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనానికి 140 మంది పూర్వ విద్యార్థులకు గాను వంద మంది హాజరయ్యారు. 41 సంవత్సరాల్లో 20 మంది పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు. సహచర మిత్రుల మృతిపై మౌనం పాటించారు. పూర్వ విద్యార్థులు తమను పరిచయం చేసుకుని, చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తోటలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 41సంవత్సరాల తరువాత చిన్ననాటి మిత్రులందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భావన శ్రీనివాసరావు, లోకం దుర్గారావు, ముత్తవరపు హైమావతి, మన్నవ అప్పారావు, గిరిజ, ప్రియతమ్, ఉల్లంగి శ్రీనివాసరావు, కంచకర్ల దుర్గారావు, బి.స్టాలిన్, రాజారావు, అవల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## గోకులాలతో రైతులకు అదనపు ఆదాయం

• టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు



గొల్లపాలెంలో గోకులాన్ని ప్రారంభిస్తున్న కొత్తపల్లి కోటేశ్వరరావు

ఫిరంగిపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గోకులాల నిర్మాణాలతో పశువుల అభివృద్ధికి కృషి చేస్తున్నదని టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం గొల్లపాలెంలో కొంటెపాటి సురేష్ పశువుల షెడ్డు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.2.30 లక్షలతో నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల రక్షణ కోసం ఈ షెడ్లు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుమ్మడి చంద్ర, డీసీ అధ్యక్షుడు పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ చెక్కు అందజేత

మంగళగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణానికి చెందిన దామర్ల దుర్గామహేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా, మంత్రి నారా లోకేశ్ సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరైంది. అనారోగ్యంతో ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గామహేశ్వరరావు మంత్రి లోకేశ్‌కు అర్జీ పెట్టుకోగా, స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ.నాలుగున్నర లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ పత్రాలను స్థానిక టీడీపీ నేతలు బాధితుడి కుటుంబసభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు బైరబోయిన శివశంకర్‌రావు, వాకా మాధవరావు, వల్లభనేని భార్గవ్, కాకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ నిత్యాన్నదానికి కూరగాయలు అందజేత



వాహనాన్ని ప్రారంభిస్తున్న పాతూరి నాగభూషణం

తాడేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ వాసుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన కార్యక్రమానికి పది టన్నుల కూరగాయలను అందజేశారు. ఈ వాహనాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం ఆదివారం ప్రా రంభించారు. నాగభూషణం మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో పాలుపంచుకునే అవకాశం రావడం అదృష్టమన్నారు. 18 సంవత్సరాలుగా నిరంతరాయంగా కూరగాయలు పంపిణీ చేసే అవకాశం రావడం ధార్మికవేత్తలకు దక్కిన మహద్భాగ్యమన్నారు. కూరగాయలను విరాళంగా అందించిన దాత కంటే రామమోహనరావు, రాధిక దంపతులు మాట్లాడు తూ నాలుగు దశాబ్దాల కిందట దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆలోచనల మేరకు టీటీడీలో భక్తుల సౌకర్యార్థం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా స్వామికి సేవ చేసుకునే అదృష్టం తమకు కలిగిందన్నారు. కార్యక్రమంలో మరడ నాగేంద్ర, వి.కోటేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, ఏవీ ఆర్కే ప్రసాద్, జగదీశ్, ఎన్ఎస్ఎన్ రావు, ఉపేంద్ర, పూర్ణచంద్రరావు, భవానీ శంకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

## వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు అపహరణ

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళుతున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అంగలకుదురుకు చెందిన సత్యవతి ఆదివారం సాయంత్రం గ్రామంలోని కాలువ రోడ్డుకు వాకింగ్‌కి వెళ్లారు. ఆ సమయంలో జనసంచారం తక్కువగా ఉండటంతో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో ఉన్న 8సవర్ల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.






### జూదరుల అరెస్టు

కొల్లిపర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం జూదరులపై దాడులు నిర్వహించగా కొల్లిపర శివారు గుదిబండివారిపాలెం అరటి తోటల్లో తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెం అరటి తోటల్లో జూదం అడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.80వేల 700లను, నాలుగు మోటా రు సైకిళ్లను సీజ్‌చేసి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి


మృతి చెందిన వృద్ధుడు

తెనాలి క్రైం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి ఆదివారం తెలిపారు. విజయవాడ-చెన్నై ప్రధాన రైలు మార్గంలో పెదవడ్లపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం తాంబరం వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి 60-62 సంవత్సరాల వయసు గల వృద్ధుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు తెల్ల పంచ, తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత గుర్తింపు ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదుచేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు

● సీఐ రమేష్‌బాబు



తెనాలి, మారీసుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సంక్రాంతి బంపర్ ఆఫర్లంటూ ఫోన్లు చేసే సైబర్ నేరగాళ్ల వల్లో చిక్కుకోవద్దని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తన కార్యాయంలో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలకు తెరలేపారని సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మీకు బంపర్ ఆఫర్ అని ఉచితంగా రీచార్జ్ చేసుకోమని మెసేజ్‌లు వస్తున్నాయని వాటిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. వారు పంపిన లింకులను, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని అది రీచార్జ్ కాదని మాల్వేర్ అని, ఓటీటీలు, పిన్ నెంబర్లను చెప్పద్దని చెపితే మీ బ్యాంకు ఖాతాలోని నగదును ఖాళీ చేస్తారని హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ మోసగాళ్లు విద్యార్థులు, మధ్య తరగతి ప్రజలు, రిటైర్ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. ఇంటర్నేషనల్ కాల్స్, లోన్ యాప్‌లు, తెలియని కాల్స్‌కు జవాబులివ్వడం ఓటీపీలు, పిన్ నెంబర్లు చెప్పవద్దని, వారి చేతిలో మోసపోవద్దన్నారు. నేరనియంత్రణకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల వలన మోసపోయిన వారు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో కాని సైబర్ క్రైమ్ నెంబరు 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### నేడు బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవం

కొల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం వద్ద సోమవారం దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం కోసం శ్రీలంక నుంచి 50మంది బౌద్ధ భిక్షువులు ఇక్కడికి రానున్నారు. ఉదయం 9 గంటలకు దీపోత్సవంను నిర్వహించనున్నారు.

### చట్టవ్యతిరేక చర్యలను ఉపేక్షించేదిలేదు: తహసీల్దార్

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ జీవహింసను ప్రోత్సహించేలా పందేలు వేస్తూ బెట్టింగుల్లో పాల్గొంటే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ గోపాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్, త్రీటౌన్ పరిధిలోని పలువురు కోడిపందేలు, బెట్టింగ్ రాయుళ్లను బైండోవర్ చేసి తహసీల్దార్ గోపాలకృష్ణ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా వారికి తహసీల్దార్ హెచ్చరికలు జారీ చేశారు. రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదుకు జనసైనికుల కృషి అభినందనీయం: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసైనికులు చేసిన కృషి అభినందనీయమని మంత్రి మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గౌతమ్‌గ్రాండ్ హోటల్లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో వలంటీర్లుగా విధులు నిర్వహించి సభ్యత్వాలు పెంచిన జన సైనికులను అభినందించి వారికి మెమొంటోలు అందించారు. జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తెనాలిని తీర్చిదిద్దుతా

● రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి మనోహర్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి మారీసుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, విజయవాడ వంటి అభివృద్ధిచెందిన నగరాలకు దీటుగా తెనాలి ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌ఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు గత 40ఏళ్లుగా సరైన రోడ్డు మార్గంలేక ఇబ్బందులు పడుతున్నట్లు తాను పర్యటించిన సమంలో స్థానికులు తెలిపారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రోడ్డు సమస్య పరిష్కరిస్తానని ఆ సమయంలో హామీ ఇచ్చానని గుర్తుచేశారు. తాను ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతి ముందే రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాటల్లో మాత్రమే అభివృద్ధి అని ప్రచారం చేసిందని చేతల్లో మాత్రం చేయలేకపోయిందని విమర్శించారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో తెనాలి ప్రాంతాన్ని ఆంధ్రాప్యారిస్ పేరుకు తగ్గట్టుగా అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్దటం జరుగుతుందని మనోహర్ స్పష్టం చేశారు. తొలుత ఆ ప్రాంతంలోని ప్రజల యోగక్షేమాలు విచారించి పలువురు నుంచి అర్జీలను అందుకున్నారు. తొలుత కాలనీకి విచ్చేసిన మంత్రి మనోహర్‌ని స్థానిక ప్రజలు, కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధ్యక్షతన జరిగిన సభలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, 23వ వార్డు కౌన్సిలర్ తోక శిరీష, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలు శాఖల అధికారులు, ఇతర సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

### పినపాడు వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తా

పట్టణంలోని పినపాడు రైల్వే ట్రాక్ వద్ద నిత్యం రైళ్ల రాకపోకలు జరుగుతున్న క్రమంలో గేట్లు పడటంతో వాహనదారులు, పాదచారులు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్య పరిష్కారానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్, లేదా అండర్ పాస్ వే వంటివి ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి మనోహర్ చెప్పారు. ఆదివారం పట్టణంలో సీసీ రోడ్డు ప్రారంభానికి వచ్చిన మంత్రి అక్కడ ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. దీని పరిష్కారానికి అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళతామని ఆయన తెలిపారు.

## యువత సామాజిక స్పృహను పెంచుకోవాలి

● పారిశ్రామికవేత్త జెట్టి శివరాం ప్రసాద్



ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న పారిశ్రామికవేత్త శివరామప్రసాద్, పక్కన నారాయణ తదితరులు

పెదకాకాని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేటి యువత ఉన్నత విద్య, ఉద్యోగాలతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పారిశ్రామికవేత్త, గ్రిన్ సోల్ పవర్ సిస్టమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జెట్టి శివరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం పెదకాకాని మండలం వెనిగండ్ల శివారులోని కౌండిన్యపురంలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ ఉపకార వేతన ప్రదానోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. సభకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. జెట్టి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం ద్వారా సామాజిక పురోభివృద్ధికి దోహదపడటంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఐఏఎస్ అకాడమీలు సహకారం అభినందనీయమన్నారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర్‌కుమార్ మాట్లాడుతూ యువత విద్యా ఉద్యోగాలతో పాటు ఉన్నత సామాజిక విలువలను అలవర్చుకోవాలన్నారు. మరో విశ్రాంత ఐపీఎస్ అధికారి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, అనవసర ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. సభలో పాల్గొన్న కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత ఉన్నత అధికారి వై సత్యనారాయణ మాట్లాడుతూ యువత అభివృద్ధిలో ఐదు 'వి'లు విద్య, వృత్తి, విత్తం (డబ్బు), వికాసం, వితరణ కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ సమాజంలో పేదరికం, ఆకలి, అజ్ఞానం తొలగిపోవాలంటే విద్య ఒక్కటే మార్గం అన్నారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ద్వారా అతి తక్కువ ఫీజులతో, అత్యున్నత ప్రమాణాలతో అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నేటి యువత సంస్థ సేవల్ని వినియోగించుకోవాలన్నారు. తొలుత వాకా రాంగోపాల్‌గౌడ్ సభకు విచ్చేసిన అతిథులకు, ఆహ్వానితులకు స్వాగతం పలికారు. అనంతరం అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. సభానంతరం అతిథులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. కార్యక్రమంలో వడ్డేగుంట సుబ్బారావు, డాక్టర్ తాతా సాంబశివరావు, కారంకి లక్ష్మీనారాయణ, పామర్తి సాంబశివరావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, చిలకా చంద్రమౌళి, డాక్టర్ టి.సేవాకుమార్, బెల్లంకొండ సదాశివగౌడ, డాక్టర్ ఎన్.కృష్ణ, ఇతర ట్రస్ట్ అండ్ ఐఏఎస్ అకాడమీ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెనాలి ప్రాంతానికే గర్వకారణం సినీనటుడు కృష్ణ

● విగ్రహావిష్కరణ సభలో మంత్రి మనోహర్


సినీనటుడు దివంగత సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి, నిర్మాత ఆదిశేషగిరిరావు

తెనాలి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతానికే గర్వకారణం సినీనటుడు దివంగత కృష్ణ సినీ ప్రస్థానం అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తెనాలి బండ్‌పై ఏర్పాటు చేసిన కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సినీరంగంలో సరికొత్త సాంకేతిక ప్రయోగాలు చేసి ప్రేక్షకుల మెప్పు పొందేలా కృష్ణ సినిమాలు రూపొందించారని చెప్పారు. చిత్రసీమ గర్వపడేలా ఆయన నడుచుకునేవారని, ఎక్కడా కూడా గర్వం, అహంకారం కనపడేది కాదని, సామాన్య జీవితం గడిపారని ప్రశంసించారు. రాజకీయాల్లో కూడా ప్రవేశించి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, కళలకు, కళాకారులకు తెనాలి ప్రాంతం పుట్టినిల్లు అని, సినీనటుడు దివంగత కృష్ణ ఈ ప్రాంతంలో పుట్టడం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు లభించిందన్నారు. నటనలో ఉన్నత శిఖరాలు చేరిన ఆయన కోట్లాది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, కేంద్ర మంత్రి సోదరుడు పెమ్మసాని రవి, కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు, నన్నపనేని సుధాకర్, ఈదర వెంకటపూర్ణ చంద్, కృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

ఫొటోరైటప్స్:

### భోగి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సిరులు కురిపించే సంక్రాంతి పండుగ రాష్ట్ర ప్రజలందరికి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మంత్రి మనోహర్ ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని పెదరావూరులో మంత్రి మనోహర్ వ్యవసాయక్షేత్రంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భోగి మంటలు వెలిగించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతుల ఇంట ధాన్యం సిరులతో నిండుగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తునిదర్శనంగా ఈ పండుగ నిలుస్తుందన్నారు. మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ అందరూ సంతోషంగా జరుపుకుంటూ ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలతో తులతూగాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయాన్ని పండుగగా చేపిస్తానని చెప్పడమే తప్ప ఆచరణలో చూపలేకపోయిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అమరావతి రాజధాన్ని వేగవంతం చేయడంతో పాటు పెట్టుబడులను కూడా పెంచి అన్ని ప్రాంతాల వారిని ఆంధ్రప్రదేశ్‌వైపు చూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రణాళికాబద్ధంగా ముందకు వెళుతున్నారని తెలిపారు. భోగి మంటలచుట్టూ మహిళలు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. టీడీపీ, జనసేన బీజేపీ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### మంత్రి మనోహర్‌కు వీరవల్లి మురళి సంక్రాంతి శుభాకాంక్షలు

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణంలు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పెదరావూరు గ్రామంలో మంత్రి మనోహర్ నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుల్లో వారు పాల్గొని మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి మనోహర్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి


కొల్లిపర మండలం మున్నంగిలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు

కొల్లిపర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగిలో స్వామి వివేకానంద జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి గ్రామపెద్దలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వివేకానంద చైతన్య వేదిక కన్వీనర్ పావులూరి శ్రీరంగ సాయిస్వామి మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిద్దిటానికి స్వామి వివేకానంద ప్రపంచం మొత్తం పర్యటించి భారతదేశ ధర్మ ప్రాధాన్యాన్ని, విశిష్టతను చాటి చెప్పారన్నారు. భారతదేశం సంస్కృతి, సాంకేతిక కలయికతో త్వరలో విశ్వగురువుగా, ప్రపంచానికి మార్గదర్శిగా మారనుందన్నారు. అందరం వివేకానంద బోధనలను ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామీణ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగా లక్ష్మారెడ్డి, చైతన్య వేదిక ప్రతినిధులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వంగా జనార్ధనరెడ్డి, నరేంద్రబాబు, డాక్టర్ రంగారావు, గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, శేఖర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### మహనీయుల అడుగు జాడల్లో నడవాలి: హెచ్‌ఎం ఏడుకొండలు

చేబ్రోలు, జనవరి 12: దేశ సంస్కృతి సంప్రదాయాలు, విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుల అడుగు జాడల్లో నేటి యువత నడవాలని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు అన్నారు. ఆదివారం నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద గొప్పతనం గురించి ఆయన పాటించిన విలువల గురించి తెలియజేశారు. స్వామి వివేకానందను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయురాలు టి.దుర్గాబాయి, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


జాతీయ యూత్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

### కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

పొన్నూరు టౌన్, జనవరి 12: పొన్నూరు పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఉదయం దీక్షల శిబిరంలో న్యాయవాదులు, గుమస్తాలు దీక్షలో పాల్గొన్నారు. బేతాళ ప్రకాష్‌పై దాడిచేసి పోలీసులు ఫిర్యాదుచేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో న్యాయవాదులు, గుమస్తాలు పాల్గొన్నారు.

### కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పొన్నూరు టౌన్, జనవరి 12: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ 1983-84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక శ్రీవీరాంజనేయ స్వామి కల్యాణ మండపంలో ఈ సమ్మేళనం నిర్వహించారు. ఓల్డ్ స్టూడెంట్స్ సొసైటీ సంస్థను ఏర్పాటు చేసి రూ.లక్ష విలువ చేసే కుర్చీలు, బల్లలు పాఠశాలకు అందజేశారు. పాఠశాలలోని పాత ఫర్నిచర్‌కు మరమ్మతులు చేయించారు. సహ విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.70,000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడిగా జీవీవీ ప్రసాద్, కార్యదర్శిగా ప్రతాప్‌సింగ్, కోశాధికారిగా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్క్రాప్‌తో విగ్రహాల తయారీ అభినందనీయం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన మాజీ మంత్రి ఆలపాటికి ఎన్టీఆర్ విగ్రహాన్ని బహూకరిస్తున్న శిల్పి కాటూరి

తెనాలి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐరన్ స్క్రాప్‌తో పలు రకాల విగ్రహాలను తయారుచేసిన శిల్పులు అభినందనీయులని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కంచర్లపాలెంలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆదివారం ఆయన సందర్శించారు. తెనాలి శిల్పులు ప్రపంచస్థాయిలో పేరు తీసుకు వస్తున్నారని, విగ్రహాల తయారీలో కొత్తపుంతలు తొక్కుతున్నారన్నారు. ఐరన్ స్క్రాప్‌తో రూపొందించిన టీడీపీ జెండా, సైకిల్, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆలపాటికి శిల్పులు బహూకరించారు. పెమ్మసాని రవి, తాడిబోయిన హరిప్రసాద్, ఖుద్దూస్, త్రిమూర్తి, శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని మహోన్నత వ్యక్తి యడ్లపాటి

● మంత్రి మనోహర్


యడ్లపాటి వెంకట్రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మనోహర్, మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమ, నన్నపనేని రాజకుమారి, తదితరులు

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎన్నో పదవులు వరించినా ఎక్కడా కూడా స్వార్థ ప్రయోజనాలకు వాడకుండా ప్రజల కోసం పాటుబడుతూ మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా రైతు బాంధవుడిగా మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత యడ్లపాటి వెంకట్రావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని దివంగత యడ్లపాటి వెంకట్రావు నివాసంలో కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మహిళాచైర్‌పర్సన్ నన్నపనేనిరాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, బీజేపీ నాయకులు యడ్లపాటి రఘునాథ బాబు, గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ నేత వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, పలువురు కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు కలిసి దివంగత యడ్లపాటి వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి శ్రేణులు, యడ్లపాటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## సరస్వతి నిలయం పీబీఎన్ కళాశాల

● కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

పొన్నూరు టౌన్, జనవరి 12: ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా ఉన్నత శిఖరాలకు చేర్చిన సరస్వతీ నిలయం పీబీఎన్ కళాశాల అని తెలంగాణ రాష్ట్ర కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పీబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కళాశాల పూర్వ విద్యార్థి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పీబీఎన్ కళాశాలలో విద్య సభ్యసించిన ఎందరో విద్యార్థులు దేశంలో అనేక రంగాలలో స్థిరపడ్డారన్నారు, కళాశాల ఎందరో పేద విద్యార్థులను ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించింది అన్నారు. పొన్నూరుకే పీబీఎన్ కళాశాల వన్నె తెచ్చిందని అభినందించారు. పీబీఎన్ కళాశాల ప్రస్థానం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో ఆహ్లాదకరంగా కొనసాగింది. ఈ సమ్మేళనంకు పోలీసు ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి, హిందూస్థాన్ యూనిలీవర్ సంస్థ చార్టెడ్ అకౌంటెంట్, కే వెంకటేశ్వరరావు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పి.అమరేంద్రనాథ్, కళాశాల అధ్యక్షుడు కెప్టెన్ అంకప్ప చౌదరి, కార్యదర్శి నన్నపనేని అన్నారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ


పారిశుధ్య సిబ్బందికి చీరలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

తెనాలి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సత్యనారాయణ టాకీసు రోడ్డులోని పాఠశాల ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణమోహనరావు కార్మికులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దాతల సహకారంతో క్లబ్ సామాజిక సేవలు నిర్వహిస్తుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుతున్న కార్మికులను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కాకరపర్తి సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, సంధ్యారాణి, కృష్ణారెడ్డి, రమణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు భారతి


విజేతలకు బహుమతులు అందిస్తున్న భారతి

తెనాలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న టెక్నాలజీతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు సైతం కనుమరుగవుతున్నాయని వాటిని కాపాడుకుని రాబోయే తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వల్లూరి భారతి అన్నారు. ఆదివారం మండలంలోని కంచర్లపాలెంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలు మ్యూజికల్ చైర్స్ పోటీల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు టి.రాఘవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, షేక్ చుక్కపల్లి భరత్, గాలి శారదాదేవి, జి.భరత్, ములకా శివకుమారి తదితరులు పాల్గొన్నారు.